# నాటో... నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్!!

**నాటో... నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్. 1949, ఏప్రిల్ 4న నార్త్ అట్లాంటిక్ ఒప్పందంపై సంతకాలు జరగడంతో... ఈ సైనిక కూటమి తెరపైకి వచ్చింది. నాటో ప్రధాన కార్యాలయం బ్రెజిల్ రాజధాని బ్రస్సెల్స్‌లో ఉంది. సభ్య దేశాల భద్రత కోసం ఉమ్మడి రక్షణ వ్యవస్థ ఏర్పాటే.. నాటో ప్రధాన ఉద్దేశం. ఏదైనా సభ్య దేశంపై బయటి దేశం దురాక్రమణకు పాల్పడినప్పుడు బాధిత దేశం రక్షణ బాధ్యతను నాటో చేపడుతుంది! తొలినాళ్లలో కొంతకాలం ఇది రాజకీయ కూటమిగానే కొనసాగింది. కొరియన్ యుద్ధం నేపథ్యంలో... సభ్యదేశాల మధ్య మరింత సమన్వయం జరిగి... అమెరికా సుప్రీం కమాండర్ల నేతృత్వంలో.. ఏకీకృత సైనిక శక్తిగా నాటో ఆవిర్భవించింది!!**

రెండో ప్రపంచ యుద్ధానంతరం.. 1949, ఏప్రిల్ 4న అమెరికా సహామొత్తం 12 దేశాలు నార్త్ అట్లాంటిక్ ట్రీటీపై సంతకాలు చేశాయి. దాంతో నాటో లాంఛనంగా ఏర్పాటైంది. శాంతి సమయంలో.. ఓ కూటమిలో అమెరికా చేరడం ఇదే మొదటిసారి.

## స్థాపనకు కారణాలు:

రెండో ప్రపంచయుద్ధానంతరం ఐరోపాలో శాంతికి సోవియట్ రష్యా ముప్పుగా మారింది. 1948 నాటి బెర్లిన్ దిగ్బంధం(పశ్చిమ హోదా దేశాల నుంచి బెర్లిన్‌కు రైలు రోడ్డు రవాణాను రష్యా అడ్డుకుంది. ఆ సమయంలో బెర్లిన్ పశ్చిమ ప్రాంతాలు రష్యా నియంత్రణలో ఉండేవి), కొరియా యుద్ధం-1950, తూర్పు ఐరోపా దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాల ఏర్పాటు తదితర ఘటనల నేపథ్యంలో.. రష్యా బలవంతగా పశ్చిమ ఐరోపాను కూడా తన అధీనంలోకి తెచ్చుకుంటుందనే ఆందోళన పశ్చిమ దేశాల్లో మొదలైంది. దాంతో రష్యాను దీటుగా ఎదుర్కొనేందుకు నాటోను ఏర్పాటు చేశారు.

## వార్సా ఒప్పందం:

నాటో ఏర్పాటుకు ప్రతిచర్యగా సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా దేశాలు.. వార్సా ఒప్పందం చేసుకున్నాయి. 1955, మేలో సోవియట్ రష్యా, అల్బేనియా, బల్గేరియా, చెకొస్లొవేకియా, తూర్పు జర్మనీ, హంగేరీ, పోలెండ్, రొమేనియా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. తూర్పు ఐరోపా దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాల పతనం.. సోవియట్ యూనియన్ కూడా విచ్ఛిన్నమవడంతో.. 1991లో వార్సా ఒప్పందం రద్దు అయింది. అంతకుముందే.. 1990లో నాటో, వార్సా సభ్య దేశాలు.. అనాక్రమణ (నాన్ అగ్రెసన్) ఒప్పందంపై సంతకాలు చేశాయి.

## నాటో సభ్యదేశాలు:

ప్రస్తుతం నాటో సభ్యదేశాల సంఖ్య 26. అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, కెనడా, ఇటలీ, టర్కీ, స్పెయిన్, గ్రీస్, పోర్చు గల్, బెల్జియం, నార్వే, లక్సెంబర్గ్, డెన్మార్క్, నెదర్లాండ్స్, ఐస్ లాండ్, పోలెండ్,

హంగేరీ, చెక్‌రిపబ్లిక్, లత్వియా, ఎస్టోనియా, లిథువేనియా, బల్గేరియా, రొమేనియా, స్లోవేకియా, స్లోవేనియా.

### సెక్రటరీ జనరల్:

జాప్ డి హూప్ స్కెఫ్ఫర్ (హాలెండ్ విదేశాంగ మంత్రి).

**ప్రధాన కార్యాలయం:** బ్రస్సెల్స్, బెల్జియం.

**నాటో దళాలు:** సుప్రీం అల్లయడ్ కమాండర్ ఇన్ యూరప్ (ఎస్‌ఏసీఈయూఆర్) నియంత్రణలో... అన్ని సభ్య దేశాల్లోనూ నాటో దళాల స్థావరాలు ఉన్నాయి. సాధారణంగా అమెరికా జనరల్ ఎస్‌ఏసీఈయూ ఆర్‌గా ఉంటారు. అంతేకాకుండా.. నాటోకు అవసరమైన ఆయుధ సంపత్తి అధికంగా అమెరికా నుంచే అందుతుంటుంది.

### వ్యూహం:

నాటో వ్యూహాత్మక విధానం సరళంగా ఉంటుంది. ఆయా పరిస్థితులకు అనుగుణంగా నాటో స్పందిస్తుంది. ఏదైనా సభ్య దేశంపై దాడి జరిగినప్పుడు.. మొదట అణ్వాయుధ దాడి చేస్తామని శత్రు దేశాన్ని బెదిరించడం నాటో వ్యూహాల్లో అత్యంత కీలకమైంది.

### బుకారెస్ట్ సదస్సు:

నాటో బుకారెస్టు సదస్సు.. రొమేనియాలోని బుకారెస్టులో 2008,ఏప్రిల్ 2,3 తేదీల్లో జరిగింది. ఆ సందర్భంగా.. సోవియట్ యూనియన్ మాజీ రిపబ్లిక్‌లైన జార్జియా, ఉక్రయిన్... నాటో సభ్యత్వాన్ని కోరాయి. అమెరికా, కెనడా, కొన్ని ఐరోపా దేశాలు సభ్యత్వం ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసినా ఫ్రాన్స్, జర్మనీ, తదితర దేశాలు గట్టిగా వ్యతిరేకిచాయి. దాంతో ఇప్పటికిప్పుడే సభ్యత్వం ఇవ్వడం కుదరదని.. భవిష్యత్‌లో తప్పకుండా సభ్యత్వం కల్పిస్తామని జార్జియా, ఉక్రయిన్‌లకు ఐరోపా నేతలు.. ఈ సదస్సులో స్పష్టంచేశారు. ఐరోపాకు ప్రధాన ఇంధన సరఫరాదారైన రష్యాతో సంబంధాలు దెబ్బతింటాయనే ఆలోచనతోనే... జార్జియా, ఉక్రయిన్‌లకు నాటోలో సభ్యత్వం కల్పించలేదని తెలుస్తోంది. నాటోలో 27వ, 28వ సభ్యదేశాలుగా చేరేందుకు వీలుగా లాంఛనంగా చర్చలు ప్రారంభించాల్సిందిగా... అల్బేనియా, క్రొయేషియాలకు సూచించారు.

### రష్యా దౌత్య విజయం:

జార్జియా, ఉక్రయిన్‌లకు సభ్యత్వాన్ని నాటో నిరాకరించడం... రష్యా దౌత్య విజయంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రెండు దేశాలకు సభ్యత్వం విషయంపై రష్యా అప్పటి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ముఖ్యంగా ఉక్రయిన్, నాటోలో చేరితే.. ఆ దేశంపై రష్యా

అణ్వాయుధాలు మోహరిస్తుందని కూడా ఆయన హెచ్చరించారు. బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ విస్తరణ.. నాటో దళాలకు, సభ్యదేశాల ప్రజల భద్రతకు ప్రమాదంగా పరిణమించనుందని నాటో నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. అమెరికా ఆధ్వర్యంలోని క్షిపణి రక్షణ వ్యవస్థ మిత్ర దేశాలకు కవచంగా ఉంటోందన్న భావనను నేతలు వ్యక్తపరచారు. పోలెండ్, చెక్ రిపబ్లిక్ స్థావరంగా ఏర్పాటు చేయనున్న అమెరికా క్షిపణి రక్షణ వ్యవస్థను... భవిష్యత్‌లో ఇతర క్షిపణి రక్షణ కవచంతో అనుసంధానం చేసే విషయంపై నాటో సభ్యదేశాలన్నీ ఆలోచించాలన్నారు. క్షిపణి రక్షణ వ్యవస్థ పట్ల అభ్యంతరాలను పక్కనపెట్టి, అమెరికాకు సహకరించాలని నాటో, రష్యాను కోరింది. మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో భాగంగా పోలెండ్‌లో పది ఇంటర్‌సెప్టార్ క్షిపణులు, చెక్ రిపబ్లిక్‌లో ఒక రాడార్ సైట్ ఏర్పాటు కానుంది.

## పుతిన్ వాదన:

తూర్పు దిక్కుగా నాటో విస్తరణ.. తన భద్రతకు తక్షణ ముప్పు గా రష్యా భావిస్తోంది. దేశ సరిహద్దుల్లో అత్యంత  శక్తివంతమైన సైనిక కూటమి ఉండటం... తమ జాతీయ భద్రతకు ప్రత్యక్ష ప్రమాదమని ఆ దేశం ఆందోళన వ్యక్తంచేసింది. జార్జియా, ఉక్రయిన్‌లకు నాటోలో సభ్యత్వం కల్పించడంపై పుతిన్ తీవ్ర అభ్యంతరం లేవదీశారు.  తిరిగి ప్రచ్ఛన్నయుద్ధం తలెత్తే పరిస్థితులను పుతిన్ తోసిపుచ్చారు. తూర్పు, పశ్చిమ దేశాల మధ్య ప్రస్తుతం ఎలాంటి సైద్ధాంతిక విభేదాలు లేవని ఆయన అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని అరికట్టడంలో, అణ్వస్త్రవ్యాప్తి నిరోధంలో.. నాటోకు రష్యా సహకరిస్తుంద న్నారు.

## ప్రచ్ఛన్నయుద్ధానంతర దశలు:

ప్రచ్ఛన్నయుద్ధానంతరం మొదటి దశలో నాటో తూర్పు వైపునకు విస్తరించింది. సెప్టెంబరు 11 దాడుల తర్వాత.. రెండో దశలో భాగంగా  కార్యకలాపాలు ఐరోపాను దాటాయి. ఉగ్రవాదంపై పోరుకు కూడా సన్నద్ధమైంది. మూడో దశ... అమెరికా-జర్మనీల మధ్య సంబంధాల పునరుద్ధరణను ప్రతిబింబిస్తుంది. జర్మనీ ఛాన్సలర్‌గా ఎంజెలా మెర్కెల్ బాధ్యతలు చేపట్టాక.. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గణనీయంగా మెరుగయ్యాయి. ఇది నాటో కార్యకలాపాలను విస్తృతంగా ప్రభావితం చేసే అవకాశముంది. యూరేసియా ప్రాంతాలకు కూడా నాటోను విస్తరించాలన్నది అమెరికా దీర్ఘకాలిక వ్యూహంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. నాటో కార్యకలాపాలను అమెరికా, అఫ్గానిస్థాన్‌కు విస్తరించడం.. ఇరాక్‌లోనూ దీని పాత్ర కీలకంగా మారిన నేపథ్యంలో.. అంతర్జాతీయంగా ఈ కూటమి ప్రాధాన్యత సంతరించుకుంటోంది. మరోవైపు శాంతి సుస్థిరతల సాధన కోసం, అఫ్గానిస్థాన్‌లో దీర్ఘకాలం ఉంటానని నాటో పేర్కొనడం గమనార్హం.

## ఆసియాలో నాటో పాత్ర:

అఫ్ఘానిస్థాన్‌లో నాటో ప్రమేయం.. భవిష్యత్‌లో ఆసియా ప్రాంతంలో ఈ కూటమి అపరిమితి ప్రభావం చూపడానికి దారి తీసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది ప్రాంతీయ భద్రతపైనా ప్రభావం చూపనుంది. ఆసియా వ్యవహారాల్లో నాటో పాత్ర విస్తరించకుండా... భారత్, దౌత్యమార్గాల ద్వారా ప్రయత్నించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆ మేరకు భారత్ తన మిత్ర దేశాలకు నచ్చజెప్పాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది!!

## పెరుగుతున్న ప్రాధాన్యత-కారణాలు:

- ఏకధ్రువ ప్రపంచ పరిమితులను అమెరికా గుర్తించడం.
- గ్లోబల్ ఆర్డర్‌లో నాటో కీలక పాత్ర పోషించాలని అమెరికా భావిస్తుండటం.
- ఇరాక్‌పై యుద్ధానికి సంబంధించి ట్రాన్స్ అట్లాంటిక్ దేశాల మధ్య విభేదాలను తగ్గించాలని ఐరోపా తలపోయడం.
- అంతర్జాతీయ వ్యవహారాల్లో ఐక్యరాజ్యసమితి పాత్ర క్రమేణా తగ్గుతుండటం.
- చైనా, ఇండియా ప్రపంచ శక్తులుగా ఎదుగుతుండటం.
- రష్యా కూడా పుంజుకుంటుండటం.
- మిడిల్ ఈస్ట్‌లో అస్థిరత.
- ప్రపంచ ఇంధన భద్రత.